


వచ్చాడు.

"మీరు సింహాచలం దిగాక మాట్లాడుదాం మాష్టారు. మాకు అక్కడ పావుగంట రెస్టు ఉంటుంది. టిక్కెట్లు కట్ చెయ్యాలి. ఏఁవీ అనుకోకండేం?!" అన్నాడు సూర్యం నమ్రతగా.

నిజమే మరి!

ఉద్యోగం. పని మానేసి తనతో మాట్లాడుతుంటే ఎలా?

నేను ఆలోచనల్లో ఉండగానే బస్సు సింహాచలం చేరుకుంది. ప్రయాణీకులు ఒక్కొక్కరే దిగుతున్నారు.

ఏఁవిటి!? ఇంత నెమ్మదిగా దిగుతున్నారనుకుంటూ బస్సు విండో నుండి బైటకు చూసాను.

స్క్వాడ్ టిక్కెట్లు చెక్ చేస్తున్నారు. సూర్యం వారి ప్రక్కన చేతులు కట్టుకు నిలబడ్డాడు.

నాకెందుకో భయం వేసింది.

మేం టిక్కెట్లు తీసుకోలేదు. కాదు సూర్యం వద్దన్నాడు. పర్లేదన్నాడు. కానీ. ఇప్పుడెలా? వాళ్లేమంటారు? ఫైన్ వెయ్యరూ?

సూర్యం ప్రక్కనే ఉన్నాడు కదా! పర్లేదు. అనుకున్నాను మళ్ళా. అందరూ దిగిపోయారు. ఆఖరున మేం దిగాం.

"టిక్కెట్లు ఇవ్వండి!" అన్నాడతను.

నాకు నోట మాట రాలేదు. సూర్యం వైపు చూసాను. నన్ను చూసి మొహం తిప్పుకున్నాడు. ఏం? ఎందుకబ్బా! సూర్యం అలా ప్రవర్తిస్తున్నాడు.

"మొత్తం ఏడుగురా! ఏం? మాష్టారూ! పెద్దవారు. మీరు కూడా ఇలా చెయ్యటం బాఁవుందా? టిక్కెట్టు లేని ప్రయాణం నేరమని తెలీదూ?!" అతను గద్దించాడు.

"కండక్టర్....." ఏదో చెప్పబోయాను.

"నేను ఆఖరికి టిక్కెట్టు....టికెట్టు అని పదిమార్లు అరుచుకుంటూ తిరిగాను సార్. వీళ్ళ దగ్గర వాళ్ళందరూ టిక్కెట్లు తీసుకున్నారు. వీళ్ళు మాత్రం తీసుకోలేదు." సూర్యం స్క్వాడ్‌తో అంటున్నాడు.

అవాక్కయి పోయాను.

మా ఏడుగురికీ మనిషికి పదిహేను రూపాయల చొప్పున వసూలు చేసి రశీదు ఇచ్చారు స్క్వాడ్.

ఏడు రూపాయల్తో పోవాల్సింది. నూట అయిదు రూపాయలు పోయాయని మా ఆవిడ తెగ బాధ పడింది.

ఏం చెయ్యను? పరువూ పోయింది. డబ్బూ పోయింది.

చాలా మంది మమ్మల్నే గమనిస్తున్నారు. కొంతమంది నవ్వుతున్నారు. కొంతమంది మమ్మల్ని దొంగల్లా చూస్తున్నారు.

గబగబా సూట్‌కేస్ అందుకొని ముందుకు దారి తీసాను. నా వెనుక ఫాలో అయ్యారు మావాళ్ళు.

హోటల్లోకి వెళ్ళి కూర్చున్నాం.

టిఫిన్ చేసి బైటకు వచ్చాం.

కండక్టర్ సూర్యం ఎదురయ్యాడు.

# భేదదృష్టి

## ధర్మపథం



దైవభక్తి ఎక్కువగా ఉండవచ్చు. నిస్సంగులైన సాధువుల యెడల సన్న్యాసుల పట్ల ఎంతో గౌరవం ఉండ వచ్చును. సర్వ మానవుల యెడల ప్రేమ, అభిమానం ఉండ వచ్చును. కాని, ఎక్కువ తక్కువ భావాన్ని చూపకుండా ఉండేవారు మాత్రం చాలా అరుదు. శ్రీమంతులు దరిద్రులనూ, బలవంతులుబలహీను లను హీనంగా చూడడం తరచుగా కాన వస్తున్నది. దానికి అహంభావం ప్రధాన కారణం. సర్వ వ్యాపకుడగు భగవ దంశఅందరి లోనూ ఉన్నదని గ్రహించాలి.

ఒక ప్రభువు దైవభక్తిపరుడు. సాధు వులన్నా సన్న్యాసులన్నా ఆతనికి గొప్ప గౌరవం. వారు లౌకిక బంధాలకు లోనుగాక జనులకు సన్మార్గాన్ని బోధించే మహనీయులని ఆయన విశ్వాసం. ఆ రాజు నివసిస్తున్న నగరానికి ఒకప్పుడు ఒక సాధువు వచ్చాడు. ఆయన గొప్పతనాన్ని గురించి జనులు చెప్పుకొనసాగారు. ఆ సాధువు ఆ వూరికి వచ్చిన సంగతి రాజుగారికి తెలిసింది. ఆయన తన అమాత్యుని ఆ సాధువు వద్దకు పంపి, ఎంతో గౌరవంతో తన భవనానికి రప్పించాడు.

ప్రభువు ఆ సాధువును పూజించి, ఆయన వలన ఎన్నో విషయాలు తెలుసుకున్నాడు. ఆయనకు విలువైన బంగారు జరి పట్టు శాలువను సమర్పించాడు. సాధువుకు దానిపై ఆశ లేదు. దాన్ని తిరస్కరిస్తే రాజు చిన్నబుచ్చుకుంటాడని, ఇష్టంలేక పోయినా స్వీకరించి తననివాసానికి వెళ్ళుతూ ఉండగా,దారిలో ఇతరులను యాచిస్తూ ఉన్న ఒక బీదరాలు కనబడింది. ఆ సాధువు, రాజుగారు తనకు బహూకరించిన ఆ పట్టు శాలువను ఆమెకు ఇచ్చి వేశాడు. ఆమె పరమానంద భరితురాలయింది. నాటితో ఆమె లేమి అంతరించింది.

ఈ సంగతి ఎలాగో రాజు చెవిని పడింది. ఆయనకు సాధువుపై తీరని కోపం కలిగింది. తానెంతో గౌరవంతో ఇచ్చిన విలువైన శాలువను ఒక దరిద్రురాలికి ఇవ్వడం తన్ను అవమా నించినట్లు ఆయన భావించి, ఆ సాధువును తన వద్దకు పిలిపించి "మీకు ఎంతో గౌరవంగా సమర్పించిన శాలువను ఒక బీదరాలికి ఇచ్చి నన్ను అవమానించడం తగునా?" అని తీవ్ర స్వరంతో ప్రశ్నించాడు.

ఆ సాధువు చిరునవ్వు నవ్వుతూ "రాజా! మీరిచ్చిన ఆ శాలువను భౌతిక, బలహీన శరీరాన్ని ధరించిన బీదరాలికి ఈయలేదు. ఆమెలో నాకు కానవచ్చిన సర్వాంతర్యామి అయిన జగన్మాతకు సమర్పించాను. నాకు ఆమెలో ఆ దేవియే కనబడింది" అన్నాడు. రాజు నిర్ఘాంతపోయాడు. ఆయనలోని అహంభావం అంతతో నశించినది.

–బులుసు వేంకట రమణయ్య

---

## క్షమించండి

"మాష్టారూ!....నన్ను క్షమించండి. అప్పుడు అలా మాట్లాడకపోతే నా ఉద్యోగం పోతుంది. నాట్ కలక్టేడ్ కేసు వ్రాస్తాడు. సస్పెండ్ చేస్తారు. నేనసలు చెకింగ్ అవుతుందనుకోలేదు మాష్టారు!" అన్నాడు ప్రాధేయపూర్వకంగా.

"క్షమించండి! మీరెవరో నాకు తెలీదు." అనేసి సూర్యాన్ని తప్పించుకొని రోడ్డు మీదకు వచ్చాను.

"మాష్టారూ!....మాష్టారూ....!" అంటూ నా వెనకే వచ్చాడు సూర్యం. అవమానం నన్ను అతలాకుతలం చేస్తోంది.

కోపంగా ఒక్కసారి వెనక్కి తిరిగి తిట్టెయ్యాలనుకున్నాను.

సూట్‌కేస్ క్రింద పెట్టి గబుక్కున వెనక్కి తిరిగాను.

సూర్యం చేతులు కట్టుకు నిలబడ్డాడు.

సూర్యంను చూస్తూ అలాగే అచేతనంగా నిలబడిపోయాను.

సూర్యం... సూర్యంలా కనిపించలేదు నాకు.

ఆటో డ్రైవర్.... ఆటో డ్రైవర్ నా కళ్ళల్లో మెదిలాడు.

చెల్లని వంద రూపాయలు మార్చటం కోసం పాపం! ఆటో కుర్రాడిని మోసం చేసాడు. అతని కష్టాన్ని దోచుకున్నాడు.

కానీ, ఇప్పుడూ....?!

తగిన శాస్తే జరిగింది.

సూర్యం నా వాలకం చూసి వెళ్ళి పోతున్నాడు. మరి, తను క్షమించడని గ్రహించాడు గాబోలు.

"సూర్యం!" అన్నాను ఆనందంగా.

అక్కడే నిలబడి నాకేసి ఆశ్చర్యంగా చూసాడు సూర్యం.

రమ్మన్నట్టు కళ్ళతోనే సైగ చేసాను.

నా మనసిప్పుడు హాయిగా ఉంది. □